మందుబాటిళ్ల పట్టివేత

విశాలాంధ్ర - శింగరాయకొండ : మండలంలోని ఆవులవారిపాలెం ప్రాంతంలో అక్రమంగా మద్యం అమ్ముతున్న సాదం కొండయ్య అనే వ్యక్తిని శింగరాయకొండ పోలీసులు అరెస్ట్ చేశారు. అతని వద్ద నుండి ఎనిమిది మద్యం బాటిళ్ళను స్వాధీనం చేసుకున్నారు. ఈసీసాల విలువ 1200 రూపాయలు ఉంటుందని అంచనా వేశారు. శింగరాయకొండ ఎస్ఐ ఫిరోజాఫాతిమా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విశాలాంధ్ర ప్రకాశం జిల్లా

చేపల చెరువులను పరిశీలించిన అధికారులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని ఉమామహేశ్వరపురం రెవెన్యూ గ్రామ పరిధిలో సర్వేనెంబర్ 402-403 లలో 14 ఎకరాల 20 సెంట్లు భూమిలో చేపల చెరువుల భూములను ఫిషరీస్ ఏడిఏ ఉషా కిరణ్, తహసిల్దార్ ఎస్ ఉషారాణిలు మంగళవారం పరిశీలించారు. ఆ భూములలో అద్దంకికి చెందిన కోయి శ్రీనివాసరావు ఆ భూములు రైతు వారీ పట్టా భూములని చేపల చెరువులుగా సాగు చేసుకుంటున్నాని ఈ భూములపై ఆర్డీవో కోర్టులో కేసు నడుస్తుందని తెలిపారు. అయితే కూకట్ల సురేష్ అనే వ్యక్తి ప్రభుత్వ భూములను అనధికారికంగా సాగు చేసుకుంటున్నారని స్పందనలో అర్జీలు దాఖలు చేయగా అధికారులు ఆ భూములను పరిశీలించడం జరిగింది. డిప్యూటీ తహసిల్దార్ జి పుల్లారెడ్డి, ల్యాండ్ డిప్యూటీ సర్వేయర్ ఆర్ రవికాంత్, వీఆర్వో కే దయానందం, సచివాలయ సర్వేయర్ కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అక్షరాన్ని బతికిద్దాం తెలుగు భాషను రక్షించుకుందాం

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : మాతృభాష అయినా తెలుగు భాషను పరిరక్షించుకోవడం మనందరి బాధ్యత అని రోజ్ స్టడీ సర్కిల్ ప్రిన్సిపాల్ తెలగ తోటి శామ్యూల్ అన్నారు. మండలంలోని ఉప్పుగుండూరు గ్రామంలో రోజ్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. సామ్యూల్ మాట్లాడుతూ తెలుగు భాష ఒక గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. 'అ' అనే అక్షరంలో వందమంది తెలుగు కవుల హారం నిర్వహించారు. కవుల యొక్క గొప్పతనాన్ని విద్యార్థులకు వివరించారు. విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రమణను పరామర్శించిన ఎంపీపీ

విశాలాంధ్ర-చీమకుర్తి : ఇటీవల రోడ్డు ప్రమాదానికి గురై ఇంటివద్దనే ఉంటున్న సూర్య దినపత్రిక రిపోర్టర్ ఎంవి రమణారావుని మంగళవారం చీమకుర్తి మండల ఎంపీపి యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్ఆర్ సిపి మండల కన్వీనర్ పమిడి వెంకటేశ్వరు, గాడిపర్తి వారిపాలెం గ్రామ పిఎస్ చైర్పర్సన్ విజయ భాస్కర్‌రెడ్డి తదితరులు పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు.

'ఉగ్ర' గెలుపే మా ధ్యేయం

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని సుబ్బకపల్లి గ్రామపంచాయతీలో మంగళవారం పోకనాయుడు ఆధ్వర్యంలో గ్రామంలోని పెద్దలందరూ ఉగ్ర గెలుపు కోసం అహర్నిశలు కృషి చేస్తామని తెలిపారు. ఎవరు ఎన్ని విధాలుగా ప్రలోభ పెట్టిన తెలుగుదేశం పార్టీని వీడేది లేదని మేమంతా తెలుగుదేశం పార్టీ కుటుంబ సభ్యులుగా ఉంటామని, తమ గురించి ఎవరెన్ని అవాకులు చావాకులు పేలిన వారి విజ్ఞతకే వదిలేస్తున్నామని ఉగ్ర గెలుపే మా ధ్యేయం అని ఖరాఖండిగా చెప్పారు. మంగళవారం సాక్షి పత్రికలో కొంతమంది దుష్టశక్తులు లేనిపోని కథనాలు ప్రచురించేలా చేశారని, అటువంటి వార్తలు ప్రచురించడం ఆ పత్రిక దిగజారుడు తనానికి నిదర్శనమని వారు తెలిపారు. టిడిపి నాయకులు చావా గాంధీ, పాములపాటి వెంకటేశ్వర్లు, చావా వీరాచార్యులు, ఈదల రమణయ్య, చావా రమణయ్య, దమ్ములపాటి లక్ష్మీ నరసయ్య, మూల రమణయ్య, మూల వెంకటాద్రి పాల్గొన్నారు.

భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలి

జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ ఎం అభిషిక్త్ కిషోర్ స్పష్టం చేశారు. నిర్దిష్ట లక్ష్యాన్ని ఏర్పాటు చేసుకుని స్టోన్ ప్లాంటేషన్ చేయాలన్నారు. మంగళవారం స్థానిక ప్రకాశం భవనం నుంచి ప్రతి రోజూ మండల స్థాయి అధికారులతో రెవెన్యూ, అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 19 గ్రామాలలో జరుగుతున్న స్వామిత్వ సర్వేను ప్రతి గ్రామంలో 3 బృందాలుగా ఏర్పడి పూర్తి చేయాలన్నారు. ఇళ్ల నిర్మాణ లబ్దిదారులను లే అవుట్లకు అనుసంధానం చేయాలని ఆయని అన్నారు. అన్ని ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియను పూర్తి చేయాలని చెప్పారు. దీనికి రాన్ని లబ్ధిదారులకు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సర్వీసులు మీ-సేవ ద్వారా కాకుండా గ్రామ, వార్డు సచివాలయాల ద్వారానే నిర్దిష్ట గడువులోగా అందేలా చర్యలు తీసుకోవాలని. సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. గ్రామ, వార్డు సచివాలయాలలో పనిచేసే సిబ్బంది ఉదయం, సాయంత్రం కచ్చితంగా బయోమెట్రిక్ హాజరు వేయాలని జాయింట్ కలెక్టర్ స్పష్టం చేశారు. సర్వీసులకు సంబంధించిన నగదును ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి జమ చేయాలని ఆయన చెప్పారు. ఆయుష్మాన్ భారత్ ఈ-కె.వై.పి.ని త్వరగా పూర్తి చేయాలని అన్నారు. జగనన్న తోడు పథకంలో మంజూరైన రుణాలను లబ్ధిదారులకు అందించడంలో జాప్యం లేకుండా చూడాలని ఆయన అధికారులను ఆదేశించారు. ప్రతిరోజూ ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించాలని జాయింట్ కలెక్టర్ చెప్పారు. ఎస్.డబ్ల్యు.పి.సి. షేర్లను ఈ.ఓ.పి.ఆర్.డి., ఎం.పి.డి.ఓ. స్పెషల్ ఆఫీసర్లు తనిఖీలు చేయాలని ఆయన పునరుద్ఘాటించారు. పెండింగ్లో ఉన్న పెద్ద నిర్మాణాలకు అంచనాలు పంపించి మంజూరు తీసుకుని నిర్మాణాలు ప్రారంభించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో సి.పి.ఓ. వెంకటేశ్వర్లు, సచివాలయాల జిల్లా ఇన్చార్జ్ ఉషారాణి, జడ్పీ సి.ఈ.ఓ. జాలిరెడ్డి, తదితర అధికారులు పాల్గొన్నారు.

ఉదయం రెవిన్యూ అంశాలపైనా మండల, డివిజన్ స్థాయి అధికారులతోనూ జాయింట్ కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవిన్యూ సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇళ్లపట్టాలు. ఆడిటీ, సాదా బైనామాలు, లాండ్ కన్వర్షన్, 22(ఏ) భూ సమస్యల పరిష్కారంలో నిబంధనల మేరకు పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డి.ఆర్.ఓ బి చిన ఓబులేసు, ఎస్‌డిపి శ్రీదేవి, ఒంగోలు, కనిగిరి ఆర్.డి.ఓ.లు విశ్వేశ్వరరావు, సందీప్ కుమార్, తదితర అధికారులు పాల్గొన్నారు.

టీడీపీని ఎదుర్కోలేక కార్యాలయాలపై దాడులు

బొమ్మనబోయన వెంకటేశ్వర్లు (వెంగనయ్య)

విశాలాంధ్ర-సీఎస్‌పురం : గన్నవరం తెలుగుదేశం పార్టీ కార్యాలయాలపై వల్లభనేని వంశీ అనుచరులు వైసీపీ నేతల దాడిని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు బొమ్మనబోయన వెంకటేశ్వర్లు (వెంగయ్య) తీవ్రంగా ఖండించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సైకోలకు గుండెల్లో భయం మొదలైందని తెలుగుదేశం పార్టీని ధీటుగా దమ్ముగా ఎదుర్కోలేక కార్యాలయాలపై దాడులు చేయటం సిగ్గుచేటని అన్నారు. వైసిపి పార్టీ దిగజారుడు రాజకీయాలు రోజురోజుకు రాష్ట్రంలో ఎక్కువైపోయాయని మొన్న మా అధినేత నారా చంద్రబాబు నాయుడు వస్తున్న ప్రజాదరణ చూసి నేరుగా ఎదుర్కోలేక వైసిపి నాయకులు అధికారులను అడ్డం పెట్టుకొని ఆయనను అడ్డుకోవాలని చూడటం సిగ్గుచేటని తెలుగుదేశం పార్టీ కార్యదర్శి నారా లోకేష్ బాబు యువగళం పాదయాత్రతో వైసిపి నేతలకు ఊపిరి ఆడక ధడ మొదలైందని, రాష్ట్రములో వైసిపి రావణ కాష్టాగా మండుతుందని ఎన్నికల సమీపిస్తున్న తరుణంలో ప్రజలను భయభ్రాంతులకు గురి చేసే విధంగా ప్రతిపక్ష నేతలపై మరియు వారి కార్యాలయాలపై వైసీపీ నేతలు దాడులకు తెగబడుతున్నారని గన్నవరం టీడీపీ కార్యాలయాలపై దాడులు చేసి కార్యాలయ సామాగ్రి ధ్వంసం చేయడం అలాగే వాహనాలు తగలబెట్టడం ఏంటి ఈ దుర్మార్గపు చర్యని తీవ్రంగా ఖండించారు. టీడీపీ అధికారం లోకి వచ్చిన తర్వాత మీ భవిష్యత్తు ఎలా ఉంటుందో ఒకసారి గమనించాలని బొమ్మన బోయన వెంకటేశ్వర్లు (వెంగయ్య) తీవ్రంగా హెచ్చరించారు. మాజీ సర్పంచ్ ఎస్‌సి మాలకొండయ్య, పునుగుపాటి రవి కుమార్, షేక్ అబ్దుల్లా, మాజీ సింగిల్విండో అధ్యక్షుడు బందారు వెంకటాద్రి, కనిగిరి నియోజకవర్గ టీడీపీ మహిళా అధ్యక్షురాలు లక్ష్మి, వార్డ్ నెంబర్ షేక్ షాను, మండల నాయకులు పటాన్ నాయబ్ రసూల్, కోటిరెడ్డి, బందారు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా రామకృష్ణ జయంతి

విశాలాంధ్ర-గిద్దలూరు : గిద్దలూరు పట్టణంలోని కాశిరెడ్డి నాయన కుంట నరవ రోడ్ నందు శ్రీ రామకృష్ణ పరమహంస ధ్యాన మందిరం నందు జయంతి వేడుకలను పూనూరు హనుమంతరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ రామకృష్ణ పరమహంస కావాల్సిన వారికి కావలసినంత జ్ఞానాన్ని అందించిన గొప్ప మహోన్నతులని కొనియాడారు. మిగతా దేవాలయాలలో కోరికలు కోరుకోవడం జరుగుతుందన్నారు. నీళ్లలో పడవ ఉండొచ్చు కానీ పడవలో నీళ్లు ఉండకూడదన్నారు. దీని ఉద్దేశం సంసార జీవితంలో ఆనందంగా సాగిపోవాలి కానీ సంసారత జీవితంలో మునిగి పోకూడదన్నారు. రామకృష్ణ మఠాలు ఆధ్యాత్మిక ధ్యాన మందిరాలలో జ్ఞానాన్ని అందుకోవడానికి తరాలకు సరిపడు జ్ఞానాన్ని అందించారని పూనూరు హనుమంతరెడ్డి అన్నారు. పాల్గొన్న భక్తులకు గోడి రామచంద్రారెడ్డి (ముంబాయి) దప్పిలికాశిరెడ్డి గిద్దలూరు దాతల ఆర్థిక సహాయంతో భోజన సౌకర్యం ఏర్పాటు చేశారు.

ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ యోగా టీచర్ బియస్ నారాయణరెడ్డి సంఘ సేవకులు పోలయ్య, రాజేశ్వరి, ఈ దుల వెంకటరామిరెడ్డి, వంశీకృష్ణ, విహెచ్‌పి జిల్లా కార్యనిర్వాహకులు వెంకటరెడ్డి, మహిళా భక్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు పథకాలు అమలు చేయాలి

విశాలాంధ్ర-కంభం : భవన నిర్మాణ కార్మిక సంఘం మండల విస్తృత స్థాయి సమావేశం బి రోశయ్య అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో భవననిర్మాణ కార్మిక సంఘం నాయకులు టి ఆవులయ్య పాల్గొని మాట్లాడుతూ కార్మికుల పోరాట ఫలితంగానే భవన, ఇతర నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పడిందని ఈ సంక్షేమ బోర్డు ద్వారా భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేయకుండా నిలుపుదల చేసిందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం భవనిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నుండి కార్మికులకు సంక్షేమ పథకాల అమలు చేయాలని లేని పక్షంలో భారీ ఎత్తున ఆందోళన చేస్తామని అన్నారు. అనంతరం కంభం మండలం భవన నిర్మాణ కార్మిక సంఘం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. కంభం మండలం భవన నిర్మాణ కార్మిక సంఘం మండల అధ్యక్షులుగా బలారపు. రోశయ్య, ప్రధాన కార్యదర్శిగా షేక్. కాజావలి, ఉపాధ్యక్షులుగా షేక్. మహబూబ్ బాషా, జి సిద్ధారెడ్డి, జి శ్రీనివాసులు, సహాయ కార్యదర్శిగా ఏ వెంకటేశ్వర్లు, సయ్యద్ నూరుల్లా ఖాద్రి, షేక్ రిషాద్, కోశాధికారిగా ఎన్ జెర్మియా మరో 13 మందితో నూతన మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సమావేశంలో సిఐటియు కంభం మండల కార్యదర్శి టి దానం సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

నేడు వేల్పూరులో సచివాలయం ప్రారంభం

విశాలాంధ్ర-శావల్యాపురం : మండలంలోని వేల్పూరు గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్ నెస్ సెంటర్లను బుధవారం ఉదయం 10 గంటలకు స్థానిక శాసనసభ్యులు బొల్లా బ్రహ్మ నాయుడు ప్రారంభించనున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్ కుమార్ తెలిపారు.

టీడీపీ ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపించండి

- గిద్దలూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల

విశాలాంధ్ర-కొమరోలు : పట్టణంలోని స్టేట్ బ్యాంకు సమీపంలో జరిగిన మండల కమిటీ సమావేశంలో గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి హాజరయ్యారు. వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం హింసాకాండ చేస్తుందని, ప్రశ్నిస్తే కేసులు, ఎదురిస్తే దాడులు చేయటం తప్ప ఈ జగన్‌రెడ్డి ప్రభుత్వానికి రాష్ట్రంలో సంక్షేమం చేయటం తెలియదన్నారు. వైసీపీ రౌడీ మూకలు గన్నవరం టీడీపీ కార్యాలయం పైనే దాడులు చేసి టీడీపీ నేతల పై కేసులు పెట్టించటం దుర్మార్గమైన పాలనకు నిదర్శనం అన్నారు. వైసీపీ ప్రభుత్వానికి ఓటమి భయం పట్టుకునే ఇలాంటి దాడులకు తెగబడిందన్నారు. తెలుగుదేశం శ్రేణులు వైసీపీ దాడులను తిప్పికొట్టెందుకు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. అదే విధంగా వచ్చే నెల మార్చి 13వ తేదీన జరిగే ఎమ్మెల్సీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి కంచర్ల శ్రీకాంత్ చౌదరి గెలుపుకు ప్రతీ ఒక్కరు గ్రాడ్యుయేట్ పూర్తి అయిన వారి చేత ఓట్లు వేయించి వారి గెలుపుకు కృషి చేయాలని టీడీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు బోనేని వెంకటేశ్వర్లు యాదవ్, మాజీ ఎంపీటీసీ సభ్యులు ముత్తుముల సంజీవరెడ్డి, మండల క్లస్టర్ ఇంచార్జ్ బిజ్జాల తిరుమలరెడ్డి, బిజ్జం వెంకట రామిరెడ్డి, రవీంద్రనాథ్‌రెడ్డి, గోడి ఓబుల్‌రెడ్డి, షేక్ నభి, కృష్ణమోహన్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ పాండురంగయ్య యాదవ్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

నివాళులర్పించిన గిద్దలూరు టీడీపీ ఇన్‌చార్జ్ ముత్తుముల

విశాలాంధ్ర-కొమరోలు : మండలంలోని పామూరుపల్లె గ్రామంలో గుండెపోటుతో మరణించిన అంబవరపు రామచంద్రారెడ్డి (75) మృతి పట్ల గిద్దలూరు టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి చింతిస్తూ వారి భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలియచేశారు. వారితో పాటు మండల టీడీపీ నాయకులు నివాళులు అర్పించారు.

ఉపాధి హామీ కూలికి పాము కాటు

విశాలాంధ్ర-శావల్యాపురం : ఉపాధి హామీ కూలికి పాము కరచిన ఘటన మండలంలోని బొందిలిపాలెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం బొందిలపాలెం ఎస్సీ కాలనీకి చెందిన రాయనూతల ఈశ్వరయ్య(40) ఉదయం ఉపాధి హామీ పథకం క్రింద పనులకు వెళ్లి పనిచేస్తుండగా పాము కాటుకు గురయ్యాడు. వెంటనే స్థానికులు 108కు సమాచారం ఇవ్వడంతో 108 సిబ్బంది వినుకొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

యథేచ్ఛగా ప్లాస్టిక్ వాడకం

- నిత్య జీవనంలో భాగమైన ప్లాస్టిక్ సంచులు
- కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలు బేఖాతర్
- రోగాల బారిన ప్రజలు
- పట్టించుకోని అధికారులు
- చేతి సంచులే వాడుదాం ప్లాస్టిక్ సంచులను వదిలేద్దాం

విశాలాంధ్ర-పీసీపల్లి : పర్యావరణానికి మానవాళి మనుగడకు ప్లాస్టిక్ సంచుల వినియోగం పెద్ద సవాల్‌గా మారింది. వీటివల్ల భవిష్యత్తులో ప్రజలు విపత్కర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. మనిషి జీవితంలో ప్లాస్టిక్ ఓ భాగమైపోయింది. వినియోగం నానాటికీ పెరిగిపోతోంది. దీంతో ఇప్పటికే వాతావరణంలో ప్రమాదకర మార్పులు చోటు చేసుకుంటున్నాయి. భూతాపం పెరిగిపోతోంది వర్షాలు సక్రమంగా పడకపోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోతున్నాయి. ఇప్పటికైనా మార్పు రాకుంటే పెను సవాళ్లను ఎదుర్కోక తప్పదు. దేశవ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధించాలనే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయి. అంతేకాకుండా ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలని అధికారులు తెలుపుతున్నారు. అయితే కనిగిరి నియోజకవర్గ పరిధిలోని అన్ని మండలాల్లో గ్రామాల్లో, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను ఎవరూ పట్టించుకోవడం లేదు. మండల కేంద్రంలో హెూల్సేల్ దుకాణాల యజమానులు, మరీ ఎక్కువగా వినియోగిస్తున్నారు. ప్రజలు ఎక్కడపడితే అక్కడ పడేసి కవర్ల వల్ల చెరువులు, కుంటలు, వాగులలో కలవడంతో పలువురు రోగాలబారిన పడుతున్నారు. అయినా ప్లాస్టిక్ కవర్ల వినియోగాన్ని నియంత్రించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

చేతి సంచులు వాడుదాం

ఇంటి నుండి చేతితో గుడ్డ సంచిని తీసుకొని బజారుకి బయలుదేరడం ఇప్పుడు ప్రతి ఒక్కరికి నామోషీగా మారింది. అలా సరదాగా సూపర్ మార్కెట్‌లోకి వెళ్లి కాసేపు కాలక్షేపం చేసి రెండు వస్తువులను కొని బ్యాగ్లో వేసుకొని రావడం ఒక ఫ్యాషన్గా మారి పోయింది. ఇక పాల ప్యాకెట్‌ని కూడా క్యారీబ్యాగ్ లోనే పట్టుకునే సుకుమారం మరికొందరిది. సరదాగా సున్నితత్వం కానీ క్యారీ బ్యాగుల వాడకం పర్యావరణానికి తీరని హాని కలుగుతుంది. క్యారీ బ్యాగులు ఒక పట్టాన మట్టిలో కలసి పోవు. కాలం గడిచే కొద్దీ చిన్న చిన్న ముక్కలుగా మారిపోతాయి. కానీ అలా నిదానంగా మట్టిలోకి జారుకునే సమయంలో క్యారీ బ్యాగులు వెలువరించే రసాయనాలు అక్కడ సారాన్ని పాడు చేస్తాయి. పీల్చేగాలి కలుషితం అవుతుంది.తద్వారా కొన్ని కోట్ల ప్లాస్టిక్ బ్యాగులు సముద్రంలో కలుస్తున్నాయి. ఇప్పుడు నగరంలో ఎక్కడ చూసినా ఈ క్యారీ బ్యాగ్లు తేలుతూ కనిపిస్తుంటాయి. వీటిని ఆహారంగా నీటి జంతువులు తిని ప్రాణాలు పోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి. దీనికితోడు నగరాలలో డ్రైనేజీలలో ఎప్పటికప్పుడు పేరుకుపోతున్న క్యారీ బ్యాగులు ఒకసారి వరదలకు కూడా కారణమవుతున్నాయి. మిగిలిపోయిన ఆహారాన్ని క్యారీ బ్యాగ్ లో ముడివేసి పారవేయడం మనకి ఉన్న అలవాటు. ఆహారం కోసం ఆవులు, కుక్కలు, గేదెలు వంటి జంతువులు ప్లాస్టిక్ సంఖ్యలను అధిక సంఖ్యలో కూడా తినేస్తూ ఉంటాయి. ఫలితం జీర్ణాశయంలో పేరుకుపోయిన ప్లాస్టిక్ సంచుల వలన జంతువులు చనిపోయిన సంఘటనలు అనేకం ఉన్నాయి.కొన్ని ప్రదేశాలలో క్యారీ బ్యాగులు మొదలు పల్చని గుడ్డతో చేసిన సంచులు, లేకపోతే కాగితంతో చేసిన సంచులు, అందుబాటులో ఉంటున్నాయి. అవకాశం ఉన్నప్పుడు అలాంటి ప్రత్యామ్నాయాలను వినియోగించుకోవాలి. ఓ చేతితో గుడ్డ సంచి మరో చేతితో గొడుగు ఇది ఆనాటి తరం అలవాటు. ఏదైనా కొనాల్సి వస్తే తెచ్చుకునేందుకు ఉపయుక్తంగా ఉంటుందని ఎండైనా వానైనా రక్షణ ఇస్తుందని గొడుగును పెట్టుకునేవాళ్ళు. వ్యక్తిగతమైన అలవాట్ల వల్ల మనిషి తనకు తాను మేలు చేసుకోవడం తో పాటు పర్యావరణాన్ని కాపాడే వారు. కాలంతో పాటు ఆధునిక సౌకర్యాలు అందుబాటులోకి వచ్చాక ఇప్పుడు ఈ రెండింటిని పట్టుకోవడం ఈతరం నామసిగా భావిస్తుంది. దీంతో అధిక శాతం ప్లాస్టిక్ వినియోగం పెరిగిపోయింది. ఈ అనర్థదాయకం అలవాటు వల్ల మనిషి తాను కూర్చున్న కొమ్మను నరుక్కున్న పరిస్థితి ఏర్పడింది. భూతాపం పెరిగిపోవడానికి, పర్యావరణం కలుషితం కావడానికి, వ్యక్తిగతంగా మనిషి అనారోగ్యం బారిన పడేందుకు ప్లాస్టిక్ వాడకం ప్రధాన కారణంగా మారింది. అంటే మనం ఎంతటి ప్రమాదకర పరిస్థితుల్లో ప్రయాణిస్తున్నమో అర్థమవుతుంది.ప్లాస్టిక్ వాడకం తీవ్రం కావడంతో పర్యావరణానికి పెనుముప్పు గా మారింది. ప్రపంచ వ్యాప్తంగా వేల కోట్ల ప్లాస్టిక్ సంచులను వినియోగిస్తున్నారు. జిల్లాలో 100 శాతం ప్లాస్టిక్ సంచులపై నిషేధం ఉన్నా మార్కెట్స్, చిల్లర వర్తకులు, చేపలు, చికెన్, మాంసాహారం, కూరగాయల వ్యాపారులు, అత్యంత ప్రమాదకరమైన ప్లాస్టిక్ సంచులను నేటికీ వినియోగిస్తున్నారు.

పలుచని సంచులతోనే ముప్పు

ప్రాథమికంగా ప్లాస్టిక్ హానికరమైనది కాదని కొందరు నిపుణులు చెబుతున్న కాలక్రమేణా పలుచని కవర్ల తయారీ వాటి వినియోగం ఎక్కువైపోయింది. దీంతో అక్రమార్జన కోసం వ్యాపారులు నిబంధనలు తుంగలో తొక్కి ప్రమాదకరమైన రసాయన రంగులు కలిపి ప్లాస్టిక్ కవర్లు తయారు చేస్తున్నారు. ఈ రసాయన రంగుల్లో ఆరోగ్యానికి హాని కలిగించే కాడ్మియం, సీసం వంటివి అధికంగా ఉంటున్నాయి. ఇవి భూమిలో కలిసిపోయే భూసారాన్ని సైతం చేస్తూ పర్యావరణానికి పెనుముప్పుగా మారుతాయి. దీంతో మానవాళి మనుగడకు ప్రమాదం ముంచుకొస్తోంది. కాలువలు మూసుకుపోవడం భూగర్భజలాలు కలుషితం కావడంతో పాటు వీటిని పశువులు తినటం వల్ల మ ృత్యువాత పడుతున్నాయి. క్యాన్సర్ కారకం ప్లాస్టిక్ వినియోగం అంటూ ఓ వైపు ప్రభుత్వం, మరోవైపు వైద్యులు హెచ్చరిస్తున్నారు. ప్రజల్లో చైతన్యం కొరవడింది మరోవైపు వ్యాపారులను ప్రశ్నిస్తే తయారుచేస్తున్న కంపెనీలను ప్రభుత్వాలు మూసివేస్తే తామేమి అమ్మకాలు చేయము కదా అంటూ ప్రజలకు బదులు ఇస్తున్నారు.

చైతన్యంతోనే సమస్యలకు చెక్

ప్లాస్టిక్ వినియోగంలో భావితరాలకు ముప్పు తప్పదని హెచ్చరికలకు ప్రజలు అవగాహనతో మెలగాల్సిన బాధ్యత ఉంది. ప్లాస్టిక్ సంచుల వినియోగం పూర్తిగా నిషేధించడం మంచిది. వాటి స్థానంలో జనపనార సంచులు, పేపర్ కవర్లు, సంచులను ఉపయోగించడం అలవాటుగా నేర్చుకోవాలి. బ్రిటన్, జపాన్ వంటి దేశాల్లో స్పీడ్ గేర్ గా వెలిసే బంగాళదుంపలతో తయారు చేసిన సంచులను వినియోగిస్తూ తమ ఆరోగ్యాన్ని, పర్యావరణాన్ని పరిరక్షిస్తూ ఉన్నారు. ప్లాస్టిక్ ,ప్లాస్టిక్ సంచులు వినియోగించిన తర్వాత ఎక్కడపడితే అక్కడ పారవేయడం పంచాయతీ, మున్సిపాలిటీలకు ఓ సవాలుగా మారింది.

జాడలేని జూట్, క్లాత్ బ్యాగ్‌లు

ప్లాస్టిక్ నిషేధం విధించినప్పటికీ ప్రజలకు ప్రత్యామ్నాయ మార్గాలను కల్పించలేక పోవడంపై అసంతృప్తి వ్యక్తం అవుతుంది. ఏ వస్తువు కొనుగోలు చేయాలన్నా ఇంటి నుండి గుడ్డ సంచులు తీసుకెళ్లే విధంగా సిద్ధం చేయడంతో పాటు మార్కెట్లోకాగితం, జూట్, క్లాత్ సంచులు అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉంది. వీటివల్ల అనేక మందికి ఉపాధి అవకాశం దక్కుతుంది.ఈ దిశగా చర్యలు తీసుకుంటే ప్లాస్టిక్ వినియోగం తగ్గి పోయి ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

పట్టించుకోని సంబంధిత అధికారులు

ప్లాస్టిక్‌ను నిషేధించాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాలను సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని నియంత్రించాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు అధికారులు పట్టించుకోవడం లేదు. అంతే కాకుండా ప్లాస్టిక్ వాడకం, వినియోగం పై ఎలాంటి అవగాహనలు కల్పించడం లేదని ఆరోపణలు బలంగా ఉన్నాయి. మండలంలోని కిరాణా దుకాణాలు,. హెూల్ సేల్ యజమానులు పండ్లు, కూరగాయల వ్యాపారులు యదేచ్ఛగా ప్లాస్టిక్ కవర్లను వినియోగిస్తున్నారు. అయినా సంబంధిత శాఖల అధికారులు స్పందించడం లేదని మండల ప్రజలు వాపోతున్నారు. ఈ కవర్‌లను ప్రజలు ఎక్కడ పడితే అక్కడ పడేయడంతో అవి చెరువులు, కుంటలు, వాగులలో కలుస్తున్నాయి. నీళ్లు కలుషితం కావడంతో పాటు పలువురు భారీ రోగాల బారిన పడుతున్నారు.

వివాహ వేడుకల్లో బొల్లా

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలోని స్థానిక కరెంట్ ఆఫీస్ కాలనీలో మంగళవారం టిడిపి నాయకులు పోలేపల్లి హరి మరదలు కోన సరస్వతి వివాహ వేడుకల్లో మాజీ జెడ్పిటిసి బొల్లా మాల్యాద్రి చౌదరి పాల్గొని నూతన వధువును ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టిడిపి కార్యదర్శి సయ్యద్ అమీర్ బాబు, మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, మండల తెలుగు రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, మండల ఎస్సీ సెల్ అధ్యక్షులు డోలా శేషాద్రి గోళ్ళ వీరబాబు, గుత్తి మహేష్, మండ్ల రమణయ్య శేషం మోషే, సిద్దవటం తిరుపతయ్య పాల్గొన్నారు.

పాఠశాలల మూసివేత ఆలోచనను విరమించుకోవాలి : ఏపీటీఎఫ్

విశాలాంధ్ర-నాగులుప్పలపాడు : పిల్లలు సంఖ్య తక్కువగా ఉందనే కారణంగా పాఠశాలలను మూసి వేయాలనే ఆలోచన వెంటనే విరమించుకోవాలని ఏపీటీఎఫ్ నాగులుప్పలపాడు మండల శాఖ అధ్యక్షుడు ఈశ్వరయ్య, ప్రధాన కార్యదర్శులు మౌలాలి, జిల్లా కార్యదర్శి జేవీఆర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే విలీనం పేరుతో పాఠశాలలో ఉన్న మూడు, నాలుగు, ఐదు తరగతుల విద్యార్థులను సమీపంలో ఉండే ఉన్నత పాఠశాలకు పంపించి ఇప్పుడు మళ్లీ పిల్లలు తక్కువగా ఉన్నారని నెపంతో రోలు 10 లోపు ఉన్న పాఠశాలను దగ్గరలోని ఉన్నత పాఠశాలలు ప్రాథమిక పాఠశాలలో కలుపుతామని తెలియజేయడం ఉపాధ్యాయులను విద్యార్థుల తల్లిదండ్రులను గందరగోళానికి గురి చేయడమేనని వారు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే 10 మంది లోపు విద్యార్థులు ఉన్న పాఠశాలల మెర్జింగ్ నిలుపుదల చేయాలని, గందరగోళ పరిస్థితులను సరిదిద్దాలని వారు కోరారు.

మాతృ భాషా జాతికి ప్రాణం

విశాలాంధ్ర-ముండ్లమూరు : మాతృభాషా జాతికి ప్రాణం వంటిదని భాష అంతరిస్తే జాతి అంతరించినట్లేనని ప్రధానోపాధ్యాయురాలు ఎన్.తఅరుణ కుమారి అన్నారు. మండలంలోని శంకరాపురం, పెదవులగల్లు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మాతృభాషను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. పెదఉల్లగల్లు ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.సునీత మాట్లాడుతూ మాతృభాష మాధ్యమాన్ని కోల్పోతే మన సంస్కృతిని కోల్పోయినట్లేనని అన్నారు. అనంతరం తెలుగు తల్లి గురించి విద్యార్థిని విద్యార్థులకు వివరించారు, తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాలలు వేసి నమస్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి వి సుబ్బరాజు. మువ్వా శ్రీనివాసరావు. కేకే కుమార్. ఉదయలక్ష్మి. విజయలక్ష్మి. నిరంజన్. సలోమి. కాటి అంకమ్మ. సుగుణావతి. సుధారాణి. రాజబాబు. కిరణ్ కుమారి. ఆండాలమ్మ. తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ నెల్లూరు జిల్లా కోఆర్డినేటర్‌గా పగడాల

విశాలాంధ్ర-రాచర్ల : మండలంలోని చినగానిపల్లె గ్రామానికి చెందిన పగడాల రంగస్వామి గిద్దలూరు తాలూకా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జిగా ఉన్న విషయం తెలిసిందే. మంగళవారం నెల్లూరు జిల్లాలో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు రుద్రరాజు నెల్లూరు జిల్లా కాంగ్రెస్ పార్టీ కోఆర్డినేటర్‌గా ఎంపిక చేస్తున్నట్లు పగడాల రంగస్వామి తెలిపారు. రంగస్వామి కాంగ్రెస్ పార్టీకి చేదోడు వాదోడుగా ఉంటూ చిన్నచిన్నగా ఒక్కో పదవిని చేపట్టి జిల్లా స్థాయి బాధ్యతను నాకు అప్పగించినందుకు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రుద్రరాజుకు కృతజ్ఞతలు తెలిపారు. అలాగే పార్టీకి విధేయుడుగా ఉంటానని తెలిపారు. నెల్లూరు జిల్లాలో ఉండే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను, నాయకులను మాజీ ఎమ్మెల్యేలను, మాజీ మంత్రులను అందరిని కలిసి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు.

తపాల ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-మార్కాపురం : పట్టణంలోని స్థానిక హెడ్ పోస్ట్ ఆఫీస్ నందు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర తపాల ఉద్యోగ సంఘాల సంయుక్త కమిటీ పిలుపుమేరకు మంగళవారం ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. తపాలా శాఖ అధికారులు ఆచరణకు సాధ్యం కాని టార్గెట్లను ఉద్యోగులపై బలవంతంగా రుద్దడం నిలిపివేయాలని తపాలా ఉద్యోగ సంఘాల ఐక్యవేదిక ఒకరోజు ధర్నా నిర్వహించడం జరిగింది. జేఏసీ నాయకులు మాట్లాడుతూ టార్గెట్ పేరుతో ఉద్యోగులపై జరుగుతున్న దాడులు అశాస్త్రీయమైన టార్గెట్ అని పెట్టి ఉద్యోగులను వేధించడం సబబు కాదని వారన్నారు. ఈ నెల 21 తేదీ నుండి 24వ తేదీ వరకు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని వారన్నారు. ఈ కార్యక్రమంలో తపాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎన్ రమణారెడ్డి రాష్ట్ర అడ్వైజర్ కమిటీ మెంబర్ మరియు డివిజనల్ ప్రెసిడెంట్ సయ్యద్ సుభాని పి3 డివిజనల్ కార్యదర్శి ఎం శశిధర్‌రెడ్డి, అసిస్టెంట్ సెక్రటరీ పి అర్షద్ ఖాన్ పి4 డివిజనల్ సెక్రెటరీ ఐ శంకర్ ప్రసాద్ మరియు జిడిఎస్ డివిజనల్ కార్యదర్శులు డి నారాయణరెడ్డి మరియు వి మణికుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సూపరింటెండెంట్‌కి వినతిపత్రం సమర్పించడం జరిగింది.

అధికారులు సమన్వయంతో ప్రజా సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-తాళ్లూరు : అధికారులు తమ శాఖలకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో ఇతర అధికారులతో సమన్వయంతో పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనము నందు మంగళవారం మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సమావేశానికి అధ్యక్షత వహించిన ఎంపీపీ తాటికొండ శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రధానంగా విద్యుత్ సమస్య, రెవెన్యూ సమస్య తదితర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ఆయా శాఖల అధికారులు సమస్యల పరిష్కారంలో చొరవ చూపాలని ఆయన తెలిపారు. మల్కాపురం సర్పంచ్ ఎస్కే కాలేశావలి మాట్లాడుతూ తమ గ్రామంలో పాఠశాలకు దగ్గరలో ట్రాన్స్‌ఫార్మర్ పిల్లలకు అందే అంత ఎత్తులో ఉన్నదని దానిని మరోచోటకు మార్చమని మూడు దఫాలుగా కోరుతున్న ఇంతవరకు విద్యుత్ శాఖ వైపు నుండి చలనం లేదని దీనిని వెంటనే పరిష్కరించాలని ఆయన తెలిపారు. బొద్ది కూరపాడు గ్రామంలో ఎస్సీ కాలనీలో విద్యుత్ స్తంభాలు, సింగిల్ కేబుల్ వేయడానికి సహకరించాలని దానికి సంబంధించిన వ్యయం తాను భరిస్తానని సర్పంచ్ మందా శాంసన్ సభ దృష్టికి తెచ్చారు. విద్యుత్ శాఖ ఏఈ బ్రహ్మం మాట తీరు సక్రమంగా లేకపోవడంతో జడ్పిటిసి మారం వెంకటరెడ్డి పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు ప్రభుత్వ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన విధివిధానాలను వివరించారు. మండల ఉపాధ్యక్షులు యిడమకంటి వెంకటేశ్వర్‌రెడ్డి, మంచాల ప్రియాంక నాగార్జునరెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు కరిముల్లా, యంపిడిఓ యుగకీర్తి, తహసీల్దార్ రామమోహన్‌రావు, ఈఓఆర్డి ప్రసన్నకుమార్, డాక్టర్ ప్రతాపరెడ్డి, డాక్టర్ రాంబాబు, డాక్టర్ ఖాదర్ మస్తాన్ బి, ఏఓ బి ప్రసాదరావు, యంఈఓ సుబ్బయ్య, ఏఈ బ్రహ్మం, శ్రీనివాసరావు, మనోహర్, సర్పంచులు, యంపిటిసిలు పాల్గొన్నారు.

'జార్జి' కళాశాలలో రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-మార్కాపురం : స్థానిక జార్జి బి.ఫార్మసీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మంగళవారం రక్తదాన శిబిరం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులు రక్త దానం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా ప్రభుత్వ ఏరియా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ వి.సుబ్బారెడ్డి హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రక్త దానం చేయడం వల్ల ఎన్నో విలువైన ప్రాణాలను కాపాడవచ్చని, అ విధంగా మీరు రక్తమిచ్చి ఉపయోగపడం హర్షణీయమని అన్నారు. రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు ప్రభుత్వ వైద్యాశాల సూపరింటెండెంట్ సుబ్బారావు ప్రశంస పత్రాలను అందజేశారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజ జయరావు మాట్లాడుతూ జార్జి విద్యా సంస్థలు నాణ్యమైన విద్యను విద్యార్థులకు బోదిస్తూనే మరోవైపు సామాజిక దృక్పథంతో అనేక సేవా కార్యక్రమాలు చేపట్టడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరంలో పాల్గొన్న విద్యార్థులకు రాజ జయరావు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఓడి అశోక్‌బాబు, ఎన్ఎస్ ఎస్ కో ఆర్డినేటర్ ఫిజికల్ డైరెక్టర్ జె.శివ తదితరులు పాల్గొన్నారు.

అరాచకంగా రాజకీయాలు

విశాలాంధ్ర-వెలిగండ్ల : ఆంధ్ర రాష్ట్రంలో అరాచీయాల వైపు రాజకీయాలు నడుస్తున్నాయని తెలుగుదేశం మండల అధ్యక్షులు ముత్తిరెడ్డి వెంకటరెడ్డి, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు కేలం ఇంద్ర భూపాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని తెలుగుదేశం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సోమవారం రాత్రి గన్నవరం నియోజకవర్గ పార్టీ కార్యాలయం టిడిపి కార్యకర్తలు లేని సమయం లో వైస్సార్సీపీ గుండాలు కొంత మంది అక్కడ ఉన్న కార్లు ఫర్నిచర్‌లను పూర్తిగా ధ్వంసం చేయటం జరిగింది. దానికి నిరసనగా ప్రజాస్వామ్యాన్ని కాపాడి ఇలాంటి దుర్మాగపు ప్రభుత్వంను గద్దె దింపాలని, పార్టీ కార్యాలయాలను తగలబెట్టిన వారు ప్రజలకు ఏమి భరోసా కల్పిస్తారని అన్నారు. ఈ కార్యక్రమంలో యద్దనపూడి సాల్మన్ రాజ్, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు కసునూరి మౌలాలి, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి కారేంపూడి వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షులు బొప్పారాజు లక్ష్మీనారాయణ, మోటాటి సుబ్బారెడ్డి, పోకల పుల్లారెడ్డి, బొబ్బా నాగ భూపాల్ రెడ్డి ,వాలిచర్ల శ్రీను, గన్నవరం గ్రామ పార్టీ అధ్యక్షులు చందా బాలకాశీరెడ్డి, పందెం రమేష్, ఆవుల మాలకొండారెడ్డి, రాయల్ల మాల్యాద్రి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ముత్తిరెడ్డి వెంకట్రెడ్డి

ధనలక్ష్మి పదవిని రద్దు చేసి ఎన్నికలు నిర్వహించాలి

సీపీఐ డిమాండ్

విశాలాంధ్ర-పామూరు : స్థానిక మేజర్ పంచాయతీ 5వ వార్డు మెంబర్ నీరికట్టు ధనలక్ష్మి పదవిని రద్దుచేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలని భారత కమ్యూనిస్టు పార్టీ డిమాండ్ చేస్తూ మంగళవారం మండల ప్రజా పరిషత్, పంచాయతీ కార్యాలయంలలో వినతిపత్రం అందజేశారు. గత పంచాయతీ ఎన్నికల్లో ధనలక్ష్మి ఐదో వార్డ్ నుండి పోటీ చేసి గెలుపొందినది. అనంతరం అంగన్వాడి ఆయాగా ఎంపికైంది. ప్రభుత్వం నుండి గౌరవ వేతనం పొందుతున్న ఐదవ వార్డు మెంబర్ నీరు కట్టు ధనలక్ష్మి పదవికి రాజీనామా చేయకుండా అంగన్వాడీలో విధులు నిర్వహిస్తున్నది. ఇప్పటికైనా మెంబర్ పదవికి రాజీనామా చేయాలని లేని పక్షంలో ప్రభుత్వం రద్దు చేసి తిరిగి ఎన్నికలు నిర్వహించాలన్నారు. మండల, స్థానిక అధికారులు స్పందించకపోతే జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సిపిఐ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మాలాలి, మండల కార్యదర్శి ప్రభాకర్, ఏఐటీయూసీ నియోజకవర్గ కార్యదర్శి పాలపర్తి మస్తాన్ రావు, ఏఐటీయూసీ మండల కార్యదర్శి నరసింహ రావు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో సామాజిక న్యాయం

కనిగిరి మున్సిపాలిటీ
వైసీపీ బీసీ సెల్ కన్వీనర్ కంటూ గురవయ్య

విశాలాంధ్ర-కనిగిరి : ఎమ్మెల్సీ అభ్యర్థుల ఎంపికలో మరోసారి సామాజిక న్యాయాన్ని పాటించి బీసీలకు పెద్దపీట వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నిర్ణయం హర్షించే విషయమని కనిగిరి మున్సిపాలిటీ వైఎస్సార్సీపీ బీసీ సెల్ కన్వీనర్ కంటూ గురవయ్య మంగళవారం కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీ స్థానిక సంస్థలు ఎమ్మెల్యే కోటా కింద మొత్తం 18 స్థానాల్లో ఎస్సీలకు రెండు, ఎస్సీలకు ఒకటి, బీసీలకు 11, ఓసీలకు నాలుగు కేటాయించి బీసీలు వైసీపీకి బ్యాక్ బోన్ అని నిరూపించిన ఘనత జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీ సామాజిక వర్గానికి పెద్దపీట వేసి కార్పొరేషన్ పదవులతో పాటు ప్రత్యక్ష, పరోక్ష ఎన్నికల్లో సామాజిక న్యాయం పాటించటం వైసీపీకి దక్కుతుందన్నారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సారాధ్యంలో కనిగిరి నియోజకవర్గం ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ నాయకత్వంలో ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందుతున్నాయి అన్నారు. మరోసారి 2024 ఎన్నికల్లో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్ కు మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని కోరారు.

లబ్ధిదారులకు అందని రేషన్

విశాలాంధ్ర-గిద్దలూరు : నగర పంచాయతీ పరిధిలో 16వవార్డ్‌లో పాత సత్య నారాయణ టాకీస్, పాముల పల్లె రోడ్డు బజార్ యందు ఈ నెల అందవలసిన రేషన్ బియ్యం లబ్ధిదారులకు అందలేదు. లబ్ధిదారులు మాట్లాడుతూ మా ప్రాంతంలో రేషన్ బండి వచ్చిన సమయంలో రేషన్ కార్డులు కూడా పెడితే కొంతమందికి బియ్యం ఇచ్చి తర్వాత స్టాక్ అయిపోయిందని రేషన్ బియ్యం బండి అక్కడి నుంచి వెళ్ళి పోయింది. మా ప్రాంత వాలంటీర్ కూడా సరైన సమచారం అందించడం లేదని రేషన్ బండి ఎప్పుడూ వస్తుందో పోతుందో ప్రజలకూ అర్థంకాక అయోమయ పరిస్థితిలో ఉన్నామని రేషన్ కోసం రోజు కూలి పనులు మానుకొని బండి దగ్గరికి వెళ్తే తీరా స్టాక్ అయిపోయిందని వెనక్కి పంపుతున్నారని అటు కూలి పనులు పోయి ఇటు రేషన్ బియ్యం అందక పస్తులు ఉంటున్నామని వారు బీజేపీ పార్టీ నాయకులకు తెలిపారు. రేషన్ అందని లబ్ధిదారుల ప్రాంతంలో గిద్దలూరు బిజెపి పార్టీ నాయకులు జిల్లా ఓబీసీ ప్రధాన కార్యదర్శి గుమ్మా రాముడు, పట్టణ అధ్యక్షుడు బివి రామాంజనేయులు, ముప్పూరు శ్రీనివాసులు సందర్శించి మోడీ నాయకత్వంలో పేద కుటుం బాలకు రేషన్ బియ్యం పేద కుటుంబాలకు అందించాలని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రతి ఒక్కరికి పంపిణీ చేయగా కొంత మంది రేషన్ డీలర్లు అక్రమాలకు పాల్పడుతూ సరైన సమయంలో రేషన్ అందించడం లేదని ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి పేద కుటుంబాలకు సరైన సమయంలో రేషన్ అందించాలన్నారు.

కెనాల్లో పడి ఇద్దరు యువకులు గల్లంతు

విశాలాంధ్ర - నకరికల్లు : గుంటూరు బ్రాంచ్ కెనాల్లో పడి ఇద్దరు యువకులు మంగళవారం గల్లంతయ్యారు. ప్రమాద వివరాలు ఇలా ఉన్నాయి. కండ్లకుంట గ్రామం వద్ద ఉన్న గుంటూరు బ్రాంచ్ కెనాల్‌లో గోపి (21), ముస్తఫా (25) అనే ఇద్దరు యువకులు గల్లంతయ్యారు. గల్లంతైన ఇరువురూ గుంటూరు స్వర్ణ భారత్ నగర్‌కు చెందిన వారిగా గుర్తించారు.

జాతీయ వాసవి సత్ర సముదాయ అధ్యక్షునిగా దేవకి వెంకటేశ్వర్లు ఎన్నిక

విశాలాంధ్ర-కనిగిరి : జాతీయ వాసవి సత్ర సముదాయ అధ్యక్షునిగా రెండవసారి ఏకగ్రీవం ఎన్నికైన దేవకీ వెంకటేశ్వర్లును కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫార్, పాలకమండలి సభ్యులు మంగళవారం దేవకీ వెంకటేశ్వర్లు స్వగృహంలో ఘనంగా సత్కరించడం జరిగింది. అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ సామాజిక సేవలో నిమగ్నమై అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్న మన కనిగిరి పట్టణానికి చెందిన దేవకి వెంకటేశ్వర్లు జాతీయస్థాయిలో గుర్తింపు రావడం మన కనిగిరి పట్టణానికి గర్వకారణమన్నారు. దేవకి వెంకటేశ్వర్లు దంపతులను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పులి శాంతి, మున్సిపల్ వార్డు కౌన్సిలర్సు, కో ఆప్షన్ సభ్యులు, వైసిపి నాయకులు, స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలుగు భాషకు పట్టాభిషేకం

విశాలాంధ్ర-కంభం : కంభం మండలంలోని ఎల్ కోట జడ్పీ ఉన్నత పాఠశాలలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం మాతృభాషకు సంబంధించిన పలు సాంస్క ృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయురాలు ఎ సరోజ తెలుగు భాషాభివృద్ధి కోసం బాలల సంఘాలను ఏర్పాటు చేసి, ఆయా సంఘాలకు గ్రంథాలయ వారధులు అని నామకరణం చేస్తూ సంఘం ద్వారా గ్రంథాలయంలో పుస్తకాలను చదివించడం, పుస్తక సమీక్షలు వ్రాయించడం, కథల పోటీలు నిర్వహించడం లాంటి వినూత్న కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నిందించడం కన్నా నేర్పించడం మిన్న అనే సిద్ధాంతాన్ని అనుసరిస్తూ తెలుగు సాహితీ సారథులు అనే బాలల సంఘం ద్వారా పాఠశాలలోని విద్యార్థులందరికీ లలిత కళల్లో శిక్షణ అందించి పోటీలను నిర్వహిస్తూ కళామతల్లి కీర్తి కిరీటంలో కలికితురాయిగా మలుస్తున్నారు. శుభోదయం అనే బాలల సంఘం ద్వారా ప్రతి నిత్యం పాఠశాల అసెంబ్లీని సజావుగా నిర్వహిస్తారు. అంతేకాకుండా తెలుగు భాషాభివ ృద్ధికి కోసం విద్యార్థుల సమన్వయంతో అష్టావధానం కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మాతృ భాషలో ఓనామాలు నేర్వని విద్యార్థులకు సైతం ప్రత్యేక తరగతులను ఏర్పాటు చేసి మాతృ భాషపై మమకారాన్ని పెంపొందిస్తున్నారు. భాషాభివృద్ధిలో భాగంగా ప్రతిరోజూ ఓ తాజా కార్యక్రమాన్ని చేపట్టి తెలుగు తేనె పట్టుకు పట్టు తాపీని అల్లుతున్నారు. అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం సందర్భంగా పదవ తరగతి విద్యార్థులకు రామాయణంలో క్విజ్ పోటీలను నిర్వహించి విద్యార్థులకు బహుమతులను అందజేశారు. బాలల సంఘాల ఏర్పాటు ద్వారా భాషాభివృద్ధిని సాధిస్తున్న తెలుగు ఉపాధ్యాయిని ఎ.సరోజ కృషిని అభినందిస్తూ పాఠశాల ప్రధానోపాధ్యాయులు బైసాని వెంకట రామకృష్ణ సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు బివి రామకృష్ణ మాట్లాడుతూ పుస్తకం తలవంచుకుని చదివితే మనం తలెత్తుతుకునేలా చేస్తుందంటూ పుస్తకం గొప్పతనం గురించి తెలియజేశారు. పాఠశాల గ్రంథాలయములో పుస్తక పఠనం, దినపత్రిక పఠనం అలవాటుగా మార్చుకోవాలంటూ హితవు పలికారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉపాధ్యాయులు తల్లిదండ్రుల కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పాడుబడిన నివాసాల వద్ద ప్రత్యేక పారిశుధ్యం చేపట్టాలి

డీపీఓ జీవీ నారాయణరెడ్డి

విశాలాంధ్ర-దొనకొండ: దీర్ఘకాలంగా మూసివేసిన లేదా పాడు బడిన నివాసాలు, బావుల వద్ద ప్రత్యేక పారిశుధ్యం నిర్వహించాలంటూ జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) జీవీ నారాయణరెడ్డి తెలిపారు. దొనకొండ గ్రామ పంచాయతీలో సర్పంచ్ గ్రేస్ దేవానంద్ ఆధ్వర్యంలో శుక్రవారం జరిగిన ప్రత్యేక పారిశుధ్య, డ్రై డే కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రజలకు అవగాహన కల్పించారు. నివాసాల వద్ద మురుగు నీటి నిల్వలు లేకుండా చేసి దోమలు నివారించ వచ్చని, సీజనల్ వ్యాధులను నిర్మూలించేందుకు ప్రత్యేక పారిశుధ్యం, డ్రై డే కార్యక్రమాలు ఎంతగానో దోహద పడతాయన్నారు. గ్రామ పర్యటనలో దీర్ఘకాలంగా మూసివేసిన గృహాల వద్ద గుర్తించిన నీటి తొట్లు శుభ్రం చేయించారు. చెత్త నుండి సంపద తయారు చేయు కేంద్రాన్ని వాడుకలోకి తీసుకు రావాలని, రోడ్లు వెంట, వీధులలో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి, హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని కార్యదర్శి పి.క్రిష్ణమూర్తికి సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కొంగలేటి గ్రేస్ దేవానంద్, ఉప సర్పంచ్ పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, ఎంపీడీఓ వి.వసంతరావు నాయక్, మండల విస్తరణాధికారి ఎస్.డేవిడ్, కార్యదర్శి పి.క్రిష్ణమూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీలోకి రుద్రవరం టీడీపీ నేతలు

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : అచ్చంపేట మండలంలో టీడీపీకి ఎదురుదెబ్బ తగిలింది. టీడీపీ బూత్ కన్వీనర్‌గా క్రియాశీలకంగా పనిచేసిన రుద్రవరం గ్రామానికి చెందిన మాగం శ్రీనివాసరావు, మాగం భాస్కరరావు, మాగం వినోద్ తమ కుటుంబాలతో సహా వైసీపీలో చేరారు. రుద్రవరంలో పర్యటించిన ఎమ్మెల్యే నంబూరు శంకరరావు సమక్షంలో పార్టీ తీర్థం పుచ్చు కున్నారు. స్వయంగా కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే వచ్చే ఎన్నికల్లో వైసీపీని గెలిపించేందుకు కృషి చేయాలని సూచించారు. నియోజక వర్గంలో పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలని కోరారు. వైసీపీ మహిళా నేత నంబూరి వసంతకుమారి, అచ్చంపేట మండలం వైసీపీ కన్వీనర్ చిలకా చంద్రయ్య ఉన్నారు.

బీసీ రిజర్వేషన్ సాధనకై కోటి సంతకాల సేకరణ

విశాలాంధ్ర-పెదకూరపాడు రూరల్ : ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు జనాభా ప్రాతిపదికన 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి, పెదకూరపాడు నియోజకవర్గ బీఎస్పీ ఇన్‌చార్జ్ ఆర్కే ఒక ప్రకటనలో అన్నారు. 1952 తరువాత ఇంతవరకు బీసీ కులజనగణ జరగలేదు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 సంత్సరాలు అవుతున్నా మెజారిటీ ప్రజలైన బీసీలకు అన్యాయం జరుగుతుందన్నారు. జనాభాలో బీసీలు 50 శాతం పైగా ఉన్నా ఇంకా విద్యా, ఉద్యోగ, రాజకీయ ఆర్థిక రంగాల్లో వెనకబడి ఉన్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే కులజనగణ చేపట్టి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రేపటి నుంచి బీసీ కులజనగణ చేపట్టాలని పెదకూరపాడు నియోజకవర్గంలో కోటి సంతకాల సేకరణ చేపడుతున్నామన్నారు.

ఎదురీతల 'వసంతం'

- సంప్రదాయ గోడలు బద్ధలు కొట్టిన మహిళ
- శివుడికి తొలి పూజ చేసిన దళిత సర్పంచి
- అన్నీ తానై తిరునాళ్ల నిర్వహణ
- ఆటంకాలను ఎదురీదిన వసంతమ్మ

విశాలాంధ్ర - అర్ధవీడు : గబ్బిలం అపశకునం. ఎగిరే జీవుల్లో కడగట్టుది. అయినా, శివాలయలయంలోకి ఏదో రూపానా దానికి అవకాశం లభిస్తుంది. దళితులు మనుష్యులే! అయినా అంటరానివారు. వీరికి దేవాలయ ప్రవేశం నిషిద్ధం అంటూ గతంలో కొందరు వ్యతిరేకించే వారు. ఇప్పటికే కొన్ని గ్రామాల్లో అదే పరిస్థితి ఉంది. ఈ పరిస్థితులోనే మరోసారి ఓ దళిత ఆడబిడ్డ గర్భ గుడిలోకి వెళ్లి శివుడికి పూజ చేసి .. మర్గదర్శిగా నిలిచారు. అన్నీ తానై ఉత్సవాలు నిర్వహించి.. 40 ఏళ్ల విరామానికి తెరదించారు. భళా అనిపించుకున్నారు. ఈ అభ్యుదయకర చరిత్రాత్మక సన్నివేశానికి అర్ధవీడు పూర్వీకుల చెన్నకేశవాలయం వేదికగా నిలిచింది. ఇలాంటి సాహసోపేతమైన కార్యంపై దళిత సర్పంచి వసంతమ్మ ఎదురీతల పూర్వాపరాలు ఇలా వున్నాయి.

ఆ వారసత్వమే ఈ తెగువ :

వసంతమ్మ స్వస్థలం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లోని తెలంగాణ. వారిది దళిత కుటుంబం. తండ్రి అభ్యుదయవాది. ఒక సోదరుడు విప్లవ సాహిత్య కారుడు. మరో సోదరుడు విప్లవకారుడు. ఇంకో సోదరుడిది పౌరజీవనం. ఈ నేపథ్యంలో సోదరీలతో తల్లి, తండ్రులతో పెరిగారు. ఈ క్రమంలో తెలంగాణలో నక్సలైట్ల అణచివేత పెరిగింది. విచారణ పేరుతో వారి కుటుంబంపై పోలీసుల తాకిడి పెరిగింది. తలదాచుకునేందుకు కుటుంబ సభ్యులకు అవస్థలు పెరిగాయి. దీనితో వసంతమ్మ హైదరాబాద్ లోని గాంధీ ఆసుపత్రి ఎంచుకున్నారు. ఈ క్రమంలో అర్ధవీడుకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్త మునగాల వీరభద్రా రెడ్డితో ఏర్పడిన పరిచయం వివాహంగా మారింది. వీరి బంధానికి ఇద్దరు సంతానం. అత్తారింటికి సంసారానికి వచ్చిన తరువాత కులం పేరుతో అవమానాలు, ఛీత్కారాలు ఆమెకు తప్పలేదు. కోడలిగా చేసిన సేవలు గుర్తించి చరమాంకంలో ఆమె అత్తగారు పశ్చాత్తాపడ్డారట. తన భర్త శాశ్వత దూరమయ్యాక తన పిల్లలకు కుటుంబ అస్తిత్వాన్ని నిలబెట్టేందుకు మానసిక క్షోభను అనుభవిస్తున్నారు. ఈ క్రమంలో రాలిన ఆకులు వసంత రుతువులో చిగురించినట్లుగా పంచాయతీ ఎన్నికలు వచ్చాయి. పైగా ఎస్సి రిజర్వ్ అయింది. కుటుంబ సభ్యుల సహకారం తోడయింది. వసంతమ్మ సర్పంచిగా ఏకగ్రీవమయ్యారు. ఇది కుటుంబ గుర్తింపునకు దోహదపడింది. తన ఇద్దరి పిల్లలకు వివాహం చేశారు. ఈ నేపథ్యంలో తన భర్త కోరిక నెరవేర్చేందుకు సాహసించారు.

సంప్రదాయ అడ్డు గోడలు బద్ధలు

గుప్త నిధుల వేటగాళ్ల భారిన పడిన చెన్నకేశవాలయ ఆంజనేయ స్వామికి ఏదైనా చేయాలనీ వసంతమ్మతో తన భర్త అనేవారట. ఈ మేరకు ఆంజనేయ స్వామి విగ్రహ పునర్నిర్మాణం పనులు చేపట్టారు. ఈ క్రమంలో శతాబ్దాలుగా ఏటా ఉత్సవాలతో, పూర్వీకుల జ్ఞాపకాలతో వెలుగొందిన చెన్నకేశవాలయం నిరాదరణకు గురైందని స్థానికులు గుర్తు చేశారు. వారి మనోభావాల మేరకు తిరునాళ్ల నిర్వహించేందుకు కంకణం కట్టారు. సానుకూలురైన స్థానికుల నుండి నిధులు సేకరించారు. ఈ విషయంలో నూర్ భాష సంఘం నాయకులూ డి మౌలాలి పాత్ర ఘణనీయం. సుమారు 40 ఏళ్లుగా నిలిచిపోయిన తిరునాళ్ల నిర్వహించి, సాంప్రదాయ అడ్డుగోడలు బద్దలు కొట్టి, శివుడికి పూజ చేశారు.

వరమిచ్చినా...కరుణ ఏది

40 ఏళ్ల తరువాత చెన్నకేశవాలయంలో శివరాత్రి నాడు పూజ చేసేందుకు శివుడి వరం లభించింది. కానీ పూజారి మాత్రం కరుణ చూపలేదు. సర్పంచి వసంతమ్మ తానే స్వయంగా శివ పూజ చేసుకున్నారు. శివపూజకెళ్లిన విశాలాంధ్ర మిత్ర బృందానికి అదే అనుభవం ఎదురైంది. గుడి వెలుపలే ఉంచి మా బృందం సభ్యుల ఇంటి పేరు, గోత్రం అడిగారు. అవి చెప్పగానే ఏవో రెండే రెండు అక్షరాలు పలికి పంపించేశారు. మాతో పాటుగా వచ్చిన మరో కుటుంబ సభ్యులను గర్భ గుడిలోకి తీసుకెళ్లి అర్చన చేశారు. ఆయన రూ.500 ఇచ్చారు. అంత దక్షిణ ఇచ్చే శక్తి మా బృందానికి లేదు.